ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.9, కనిష్ఠం 23.5
కామారెడ్డి జిల్లా వార్తలు
5
బుధవారం 16 అక్టోబరు 2024



రేపు చెస్, టేబుల్ టెన్నిస్ ఎంపికలు

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాస్థాయి అండర్ 14, 17 బాల బాలికలకు చెస్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ హీరాలాల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెస్ ఎంపికలు దేవునిపల్లి ప్రభుత్వ పాఠశాలలో, టేబుల్ టెన్నిస్ ఎంపికలు కామారెడ్డి సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఉంటాయని తెలిపారు. క్రీడాకారులు నిజ ధ్రువీకరణకు బోనాఫైడ్‌తో రావాలని సూచించారు. ప్రతీ పాఠశాల నుంచి ఇద్దరు బాలికలు, ఇద్దరు బాలురు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. మిగిలిన వివరాలకు 9490015388 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.







సన్న ధాన్యం తీసుకునేందుకు

మిల్లర్ల విముఖత!

- ఇప్పటికే కలెక్టర్‌కు విన్నవించిన రైస్‌మిల్లర్లు
- నిబంధనల ప్రకారం సన్నాల సీఎంఆర్ ఇవ్వాలంటే తీవ్రంగా నష్టపోతాం
- సీఎంఆర్ చార్జీలు పెంచితేనే సన్నాలు తీసుకుంటాం
- సన్నాల కొనుగోళ్లపై స్పష్టమైన ఆదేశాలు ఇవ్వని ప్రభుత్వం
- ఇప్పటికే 29 కేంద్రాలు ప్రారంభించినా జరగని ధాన్యం కొనుగోళ్లు
- 2 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాల కొనుగోళ్ల లక్ష్యం

కామారెడ్డి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నధాన్యం తీసుకునేది లేదని మిల్లర్లు తేల్చి చెబుతున్నారు. సన్న ధాన్యం తీసుకుని సీఎంఆర్ కింద తిరిగి ప్రభుత్వానికి నిబంధనల ప్రకారం ఇస్తే తాము తీవ్రంగా నష్టపోతామని రైస్‌మిల్లర్లు ఆందోళన చెందుతున్నారు. మిల్లింగ్ సమయంలో దొడ్డురకం బియ్యం మాదిరిగా సన్నరకం బియ్యం పూర్తిస్థాయిలో రాదని లోటు బియ్యాన్ని తాము ఎక్కడి నుంచి పూడ్చాలని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీఎంఆర్ చార్జీలు ప్రభుత్వం పెంచడం లేదని చార్జీలు పెంచితే సన్నాలు తీసుకుంటామని మిల్లర్లు పేర్కొంటున్నారు. సన్న ధాన్యం తీసుకునేది లేదని ఇప్పటికే జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు విన్నవించారు. మరోవైపు ప్రభుత్వం తరఫున జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనప్పటికీ కొనుగోళ్లు మాత్రం జరగడం లేదు. ఓ వైపు మిల్లర్లు సన్న ధాన్యం తీసుకోమంటూ విముఖత చూపుతుండడం మరోవైపు సన్నాల కొనుగోళ్లపై ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు రాకపోవడంతో కొనుగోళ్లు చేయడం లేదనే వాదన సంబంధిత శాఖ అధికారుల నుంచి వినిపిస్తోంది.

2 లక్షల మెట్రిక్ టన్నుల సన్నాల కొనుగోళ్ల లక్ష్యం

ఈ వర్షాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 3 లక్షల ఎకరాలకు పైగా వరి సాగైంది. ఇందులో 6.80 లక్షల మెట్రిక్ టన్నుల్లో వరి దిగుబడులు వస్తాయని 6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తరలిస్తారని అధికారులు అంచనా వేశారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో 556 కేంద్రాలు దొడ్డు రకం, 63 కేంద్రాలను సన్నరకం ధాన్యం సేకరించేందుకు ఏర్పాట్లు చేశారు. 4 లక్షల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 2లక్షల మెట్రిక్ టన్నులలో సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వం సన్నాలకు రూ.500ల బోనస్ ఇవ్వనున్నందున సన్నాల ధాన్యం వేరుగా కొనుగోలు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాలో 63 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

సన్నాలు తీసుకోమంటూ కలెక్టర్‌కు వినతి

జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయి. నస్రుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ, బిచ్కుంద, లింగంపేట, ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో సన్న రకం ధాన్యాన్ని వేల ఎకరాల్లో సాగు చేశారు. ప్రభుత్వం సన్నాలకు బోనస్ ప్రకటించడంతో అధికారులు సైతం వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే పలుచోట్ల వరి కోతలు ప్రారంభం కాగా సన్నరకం ధాన్యాన్ని మార్కెట్‌లోకి రైతులు తరలిస్తున్నారు. అయితే తాము సన్న రకం ధాన్యాన్ని తీసుకోమంటూ మిల్లర్లు పేచి పెట్టారు. గత 4 రోజుల కిందట జిల్లా కలెక్టర్‌కు రైస్‌మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ప్రస్తుతం రైస్‌మిల్‌లు నష్టాల్లో నడుస్తున్నాయని ఇలాంటి సందర్భంలో సన్న ధాన్యం మిల్లింగ్ చేయలేమంటూ కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే అనేక రకాల సమస్యలు వేధిస్తున్నాయని వివరించారు. సన్న రకం మిల్లింగ్ చేయడం వల్ల లక్షల రూపాయలు నష్టపోతామని మిల్లర్లు చెప్పుకొస్తున్నారు. సీఎంఆర్ చార్జీలు సైతం ప్రభుత్వం పెంచడం లేదని ప్రభుత్వ నిబంధనల ప్రకారం సన్నరకం ధాన్యానికి ఇవ్వడం కుదరదని మిల్లర్లు చెబుతున్నారు.

మిల్లింగ్ చార్జీలు పెంచడం లేదు

గత 15 ఏళ్లుగా ప్రభుత్వం కేటాయిస్తున్న ధాన్యాన్ని మిల్లర్లు సేకరిస్తున్నారని మిల్లింగ్ చేసి తిరిగి బియ్యాన్ని ప్రభుత్వానికి అందిస్తున్నప్పటికీ మిల్లింగ్ చార్జీలు మాత్రం పెంచడం లేదని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వింటాల్ రా రైస్‌కు రూ.30, బాయిల్డ్ రైస్‌కు రూ.15 చెల్లిస్తున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో సన్న రకం ధాన్యాన్ని తీసుకుని తిరిగి బియ్యం రూపంలో ప్రభుత్వానికి ఇవ్వాలంటే నష్టం వస్తుందన్నారు. సన్న రకానికి చెందిన ధాన్యాన్ని మిల్లింగ్ చేసినట్లయితే 56 కిలోల బియ్యం మాత్రమే వస్తాయని అదే దొడ్డు రకం ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే 67 కిలోల బియ్యం వస్తుందంటున్నారు. కానీ ప్రభుత్వం విధించిన నిబంధనల ప్రకారం సన్న, దొడ్డు రకం ఏ ధాన్యాన్ని మిల్లింగ్ చేసిన 68 కిలోల సీఎంఆర్ ఇవ్వాలని ఆదేశించింది. సన్న రకాలను తీసుకుని మిల్లింగ్ చేస్తే క్వింటాల్‌కు 10 కిలోల బియ్యం తక్కువగా వస్తుందని ఈ లోటును ఎక్కడి నుంచి పూడ్చాలని మిల్లర్లు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ప్రకారం సన్న ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తే తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సన్న ధాన్యం తీసుకునేందుకు మిల్లర్లు విముఖత చూపుతున్నారు.

డిసెంబరు నాటికి నీటిని సరఫరా చేయాలి

కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): వచ్చే డిసెంబరు నాటికి మిషన్ భగీరథ నీటిని కామారెడ్డి మున్సిపల్, 215 ఆవాసాలకు సరఫరా చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. మంగళవారం సదాశివనగర్ మండలం దగ్గి గ్రామం వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు ఆగిపోయిన ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా 195 కోట్లతో మంజూరైన మిషన్ భగీరథ పైప్‌లైన్ పనుల పురోగతిని కలెక్టర్ పరిశీలించారు. సదాశివనగర్ మండలం దగ్గి గ్రామం వద్ద పైప్‌లైన్ పనుల్లో రాయి ఏర్పడి పనులు ఆగిపోయాయని, బ్లాస్టింగ్ చేయాల్సి ఉందని, ఆర్డీవో అనుమతి కావాలని ఇంజనీరింగ్ అధికారులు కోరగా వెంటనే అనుమతించాలని ఆర్డీవోకు కలెక్టర్ సూచించారు. మరికొంత కల్వర్టుల పనులు అటవీ భూముల్లో చేయాల్సి ఉన్నందున జిల్లా అటవీ అధికారి అనుమతులు కావాలని తెలుపగా ఈ అనుమతులు ఇవ్వాలని డీఎఫ్‌వోను కలెక్టర్ ఆదేశించారు. జాతీయ రహదారి 44 వెంబడి పైప్‌లైన్ వేయుటకు ఎన్‌హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ అనుమతి కావాలని కోరగా వెంటనే అనుమతించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మల్లన్నగుట్ట వద్ద నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఎస్‌ఈ రాజేంద్రకుమార్, ఆర్‌డీఓ రంగనాథ్‌రావు, జడ్పీసీఈవో చందర్, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఈఈలు నరేష్, రమేష్, డిప్యూటీ ఈఈలు నవీన, కేఎల్ఎస్ఆర్ గుత్తేదారు అర్షిద్ అలీఫ్ తదితరులు పాల్గొన్నారు.



నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించాలి

సదాశివనగర్: సూపర్‌వైజర్‌లు, సీడీపీవోలు అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షణ చేయాలని అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల హాజరు శాతం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు రిజిస్టర్‌లను పరిశీలించి, కేంద్రంలోని ప్రతీ ఒక్క పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా అంగన్‌వాడీ టీచర్, సూపర్‌వైజర్‌లు పర్యవేక్షణ చేయాలని తెలిపారు. విద్యార్థుల బరువు, ఎత్తులను కలెక్టర్ పరిశీలించారు. తక్కువ బరువు గల విద్యార్థులను గుర్తించి పౌష్టికాహారం అందించాలని తెలిపారు. కేంద్రంలోని పిల్లలకు ఆట, పాటలను నేర్పించాలని, మంచి విద్యాబుద్దులు నేర్పించాలని తెలిపారు. కేంద్రాల్లో పిల్లలు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కేంద్రంలోని పిల్లలకు, బాలింతలు, గర్భిణులకు అందిస్తున్న భోజనంలను కలెక్టర్ వంట గదిలో పరిశీలించారు. భోజనానికి ముందు విద్యార్థులు వారి చేతులను కడిగే పద్ధతులను కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం నిర్వహించాలని, ప్రజలకు అవగాహన కల్పించాలని పంచాయతీ కార్యదర్శికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, జడ్పీ సీఈవో చందర్, సూపర్‌వైజర్, సీడీపీవో తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించాలి



ఎల్ఆర్ఎస్ ల్యాండ్ మ్యాప్ పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారి పక్కనే ఎల్ఆర్ఎస్ స్థలాలను మంగళవారం సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. తహసీల్దార్ వద్ద ఎల్ఆర్ఎస్ స్థలాల మ్యాప్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిట్లంలో 1360 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్‌లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో కమలాకర్, ఆర్ఐ శీతల్, ఎంపీవో యాదగిరి, యాదగిరి సిబ్బంది ఉన్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

తాడ్వాయి: మండలంలో వచ్చిన ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అభివృద్ధి అధికారి కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పూర్తి చేయాలని అన్నారు. నందివాడ గ్రామంలోని అంగన్‌వాడి సెంటర్‌ను తనిఖీ చేశారు. గ్రామంలోని కంపోస్టు షెడ్‌ను పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రపంచ హ్యాండ్ వాష్ డే సందర్భంగా పాఠశాలలో పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సవితారెడ్డి, ఆర్ఐ లక్ష్మణ్ పాల్గొన్నారు.

దోమకొండ: ఎల్ఆర్ఎస్ క్షేత్రస్థాయి ధ్రువీకరణను వేగవంతం చేసి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి జ్యోతి సూచించారు. దోమకొండ పంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ టీమ్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దోమకొండ మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. పిల్లలకు, గర్భిణీ, బాలింతలకు పౌష్టికాహారం సరఫరాలో నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్: పంచాయతీ పరిధిలో ఎల్ఆర్ఎస్ కోసం 350 దరఖాస్తులు వచ్చినట్లు డీఎల్‌పీవో నాగరాజు వెల్లడించారు. గతంలో ఎల్ఆర్ ఎస్ కోసం దరఖాస్తులు చేసుకున్న వాటిని బాన్సువాడ డీఎల్‌పీవో నాగరాజు మంగళవారం పరిశీలించారు. అనంతరం క్షేత్ర స్థాయిలో స్థలాన్ని పరిశీలించి సర్వే వివరాలపై అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించనున్నట్లుతెలిపారు. ఆయనతో పాటు ఎంపీవో లక్ష్మీ నర్సయ్య పాల్గొన్నారు.

పాఠశాలలకు..

కొత్త టీచర్ల రాక!



పోస్టింగ్ పత్రాన్ని అందుకుంటున్న నూతన ఉపాధ్యాయురాలు

- కలెక్టరేట్‌లో మంగళవారం ఎస్‌ఏ, పీఈటీ, ఎస్జీటీలకు కౌన్సెలింగ్
- నేటి నుంచి పాఠశాలలకు కొత్త ఉపాధ్యాయులు వచ్చే అవకాశం
- జిల్లాలోని ఆయా పాఠశాలల్లో తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- జిల్లా వ్యాప్తంగా 440 కొత్త ఉపాధ్యాయుల భర్తీ

కామారెడ్డి టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అనేక పాఠశాలల్లో విద్యాబుద్దులు నేర్పించే ఉపాధ్యాయులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ వచ్చారు. ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన డీఎస్సీ ద్వారా నూతన ఉపాధ్యాయుల భర్తీ ప్రక్రియ చేపట్టి వారికి నియామక పత్రాలు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా అందించారు. అయితే నూతన ఉపాధ్యాయులకు మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాల్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు నూతనంగా నియామకమైన స్కూల్ అసిస్టెంట్‌లు, పీఈటీలు, భాషా పండితులు, సెకండరీ గ్రేడ్ టీచర్‌లు హాజరయ్యారు. ఇప్పటికే జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ, జిరాక్స్ కాపీలను అందించారు. మెరిట్ ఆధారంగా ఖాళీల పోస్టులను ఎంపిక చేసుకునేందుకు అవకాశం కల్పించి మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి వారు ఎంపిక చేసుకున్న పాఠశాలలకు పోస్టింగ్‌లను కేటాయించారు. ఈ ప్రక్రియ అంతా డీఈవో రాజు ఆధ్వర్యంలో కొనసాగింది.

జిల్లాలో 440 మందికి పోస్టింగ్

జిల్లాలో డీఎస్సీ ద్వారా 440 మంది ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. ఇందులో 130 మంది స్కూల్ అసిస్టెంట్‌లు, భాషా పండితులు, పీఈటీలు ఉన్నారు. మిగిలిన 310 మంది ఎస్జీటీలు ఉన్నారు. ఉదయం 9 గంటల నుంచి 1 గంటల వరకు స్కూల్ అసిస్టెంట్‌లకు కౌన్సెలింగ్ నిర్వహించి పోస్టింగ్‌లు కేటాయిస్తామని విద్యాశాఖ అధికారులు సమయం కేటాయించినప్పటికీ మంగళవారం రాష్ట్ర విద్యాశాఖ కౌన్సెలింగ్‌ను వాయిదా వేసిందని ఒకసారి మరోసారి అలాంటిదేమి లేదని సమాచారం రావడంతో కౌన్సెలింగ్‌ను కొనసాగించారు. మధ్యాహ్నం 2 గంటలకు ఎస్జీటీలకు కౌన్సెలింగ్ కావాల్సి ఉండగా సాయంత్రం నుంచి కౌన్సెలింగ్ కొనసాగి అర్ధరాత్రి వరకు జరిగింది. వారికి సైతం పోస్టింగ్‌లను కేటాయిస్తామని విద్యాశాఖ సిబ్బంది పేర్కొన్నారు.

విద్యార్థులకు తప్పనున్న అవస్థలు

పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక ఉన్న ఉపాధ్యాయుల పైన భారం పడడంతో విద్యార్థులకు సరైన బోధన అందడం లేదని ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటి నుంచో వాదనలు వినిపిస్తు వస్తున్నాయి. విద్యార్థుల గోసలను ఏ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు అనేక సార్లు డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల పోస్టులను నింపాలని ధర్నాలు, నిరసనలు తెలిపిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీంతో ఇటీవల నూతనంగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం సైతం విద్యార్థుల గోసలు తీరేలా ఉపాధ్యాయులను నియమించాలని సంకల్పించి డీఎస్సీ ద్వారా పోస్టుల భర్తీ చేపట్టింది. దీంతో ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయుల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులకు ఇక ఇబ్బందులు తప్పనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక తమ పిల్లలకు విద్యాబుద్ధులు అందాలని కోరుకున్న తల్లిదండ్రులు ప్రైవేట్ బస్సులలో పంపడం, ఫీజులు కట్టేందుకు నానా అవస్థలు పడుతూ ప్రైవేట్ పాఠశాలలకు పంపి ఆర్థిక భారాన్ని మోయాల్సిన పరిస్థితి ఎదురైంది. ఇకమీదట సమీప పాఠశాలల్లోనే ఉపాధ్యాయులు రావడంతో విద్యార్థులకు సరైన బోధన అందే అవకాశం ఉండడంతో వచ్చే విద్యాసంవత్సరం నుంచి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపేందుకు సిద్ధమవుతామని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్‌కు హాజరైన నూతన ఉపాధ్యాయులు

గాలికుంటు వ్యాధితో మూగ జీవాలకు ప్రమాదకరం


మగ్గిడిలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది


అనంతగిరిలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం


బొప్పాపూర్‌లో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యాధికారి

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి సోకితే పాల దిగుబడిపై తీవ్ర ప్రభావం ఉంటుందని మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ లక్కం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందారులు, పాడి రైతులు తమ పశువులకు జీవాలకు గాలికుంటు వ్యాధి రాకుండా తప్పనిసరిగా నివారణ టీకాలు వేయించాలని అన్నారు. గొర్రెలు, మేకలకు సోకే గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని, ఈ వ్యాధులు సోకిన పశువులు మేత మేయకపోవడంతో జీర్ణక్రియ మందగిస్తుందన్నారు. వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించి పశువైద్యులచే చికిత్సలు, టీకాలు వేయించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో వీడీసీసభ్యులు నరేష్, సాగర్, రమేష్, చిన్నయ్య, పశువైద్య సిబ్బంది శ్రీనివాస్, నాగర్జున, రాజేశ్వర్, రాజన్న, సురేష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలూర్‌లో..

ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 314పశువులకు ఉచిత టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డాక్టర్ సందీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది సురేష్, మహేశ్వరి, వాణి, నర్సయ్యలు పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని అనంతగిరి, ధర్మారంలలో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలను పంపిణీ చేశారు. రెండవ విడత గాలికుంటు నివారణ టీకాలను మంగళవారం నుండి నవంబర్ 14వరకు అందించడం జరుగుతుందని నవీపేట పశువైద్య శాఖ అధికారి నరేందర్ తెలిపారు. మండలంలోని సుమారు 13,400 పశువులకు ఈ టీకాలు అందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో పద్మావతి, హస్సేన్, రవి తదితరులున్నారు.

ముప్కాల్: ఉమ్మడి బాల్కొండ మండలంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు బుధవారం నుంచి వచ్చే నెల 14వ తేదీ వరకు శిబిరం నిర్వహించనున్నట్లు పశువైద్యాధికారి గౌతమ్‌రాజ్ తెలిపారు. ఉమ్మడి బాల్కొండ మండలంలోని అన్ని గ్రామాలలో ఆవులకు, గేదేలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండలం బొప్పాపూర్ గ్రామంలో మంగళవారం 92 పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయడం జరిగిందని మండల పశువైద్యాధికారి సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. పశు పోషకులు తమ పాడి పశువులకు ఆవులు, గేదెలకు గాలికుంటు నివారణ టీకాలు వేయించుకోవాలని కోరారు. ఈ అవకాశాన్ని పశు పోషకులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారోజి గంగారాం, బాపూజీ, లింగం, ఎస్.కృష్ణ, పాడి రైతులు పాల్గొన్నారు.

ఎడపల్లి: పాడి రైతులు తమదగ్గర ఉన్న పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ అన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో మంగళవారం జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఐదోవిడతలో పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా నివారణ టీకాలు వేశారు. తొలి రోజు 434 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మహేంధర్, పాడి రైతులు తదితరులు ఉన్నారు.

కమ్మర్‌పల్లి:పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధిసోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గాలికుంటూ వ్యాధినిరోధక టీకాలు వేయించాలని కమ్మర్‌పల్లి మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌రావు అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో గ్రామంలోని పాడిగేదెలు, అవులు, పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యసిబ్బంది చిత్రసాయి, విఏ స్వప్న, హెచ్‌సి సత్యం ఓఎస్ స్వరన్, గోపాలమిత్రాలు, పశుపెంపకందాలరు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జూనియర్ పశువైద్యాధికారిణి శశిరేఖ అన్నారు. మంగళవారం మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో 535పశువులకు, 152అవులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేశామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యా సబార్డినేటర్ ఎం.అనిల్, గోపాల మిత్రలు రాజ్‌కుమార్, పద్మరావు, వీడీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.


సాహెబ్‌పేట్‌లో ..

వేల్పూర్: వేల్పూర్ మండలం సాహెబ్‌పేట్ గ్రామంలో మండల పశువైద్యాధికారి కె.సంతోష్ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా పశు వైద్యాధికారి సంతోష్ మాట్లాడుతూ గోవు, గేదెజాతి పశువులలో నాలుగు నెలలు పైబడిన అన్ని పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు చేపటడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సురేష్, జేవీవో గంగాధర్, ఎల్ఎస్ఏ మౌలన, వీఏ దయానంద్, వాజిద్, పశువైద్య సిబ్బంది, పాల మిత్ర గ్రామ రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి: రైతులు తమ పశువులకు తప్పనిసరి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని మండల పశువైద్య అధికారి సురేష్ కుమార్ తెలిపారు. కోటగిరి మండలంలోని వల్లభాపూర్ గ్రామంలో మంగళవారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సుధీర్‌గౌడ్, తుకారాం పాల్గొన్నారు.

బోధన్‌లో భారీ చోరీ


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

బోధన్‌రూరల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులోని ఆచన్‌పల్లిలోని శ్రీనివాస్ నగర్ కాలనీలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళాలను పగులగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు ఐదు ఇళ్లలలో చోరీ చేయడానికి ప్రయత్నించారు. ఇంటికి తాళాలు ఉన్న ఇళ్లను ముందుగానే పసిగట్టి ప్రణాళిక ప్రకారం చోరీకి యత్నించారని పట్టణ సీఐ వెంకట నారాయణ వివరించారు. మూడు ఇళ్లలో ఏమి దొరకకపోవడంతో పాటు మరో రెండు ఇళ్లకు బయట నుంచి గొళ్లెం వేశారన్నారు. జన సంచారం ఎక్కువగా లేని ప్రాంతాన్ని దొంగలు ఎంచుకున్నారన్నారు. కాలనీలో నివాసం ఉండే వడ్ల వ్యాపారి శాఖమూరి వెంకటేశ్వర్ రావు ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌కు వెళ్లి మంగళవారం ఉదయం తిరిగి రావడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వ్యాపార నిమిత్తం ఇంట్లో ఉంచిన రూ.50లక్షల నగదుతో పాటు 20తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు శాఖమూరి వెంకటేశ్వర్‌రావు ఆరోపించారు. మంగళవారం విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్, డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. సీసీ పుటేజీ ద్వారా అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఘటన స్థలాన్ని సందర్శించి అన్ని కోణాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ పుటేజీల ద్వారా దొంగలను తప్పకుండా పట్టుకుంటామన్నారు. పట్టణ శివారు ప్రాంతాల ప్రజలు, జన సంచారం తక్కువ ఉన్న కుటుంబాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పగటిపూట సంచరిస్తే తమకు సమాచారం అందించాలన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒక రోజు జైలు

బోధన్‌రూరల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపించిన కేసులో బోధన్ కోర్టు సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి మంగళవారం ఒకరోజు జైలుశిక్ష విధించారు. సోమవారం మద్యం అతిగా సేవించి వాహనాన్ని నడుపుతున్న వ్యక్తిని పోలీసులు మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. ఈ సందర్భంగా కోర్టు న్యాయమూర్తి శేషతల్ప సాయి 2వేల రూపాయల జరిమానతో పాటు ఒక రోజు జైలుశిక్ష విధించారు. ఈ సందర్భంగా పట్టణ సీఐ వెంకట నారాయణ మాట్లాడుతూ ప్రజలు మద్యం తాగి వాహనాలు నడపవద్దన్నారు. కొత్త చట్టాలు అమలులోకి వచ్చాయని పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించబడుతుందన్నారు.

డీఎస్సీలో 20మందికి ఉద్యోగాలు

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో 20మంది ఉద్యోగాలు సాధించినట్లు లైబ్రేయన్ వరలక్ష్మీ తెలిపారు. ప్రతీరోజు గ్రంథాలయంలో శిక్షణ పొందిన 20మంది స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ ఉద్యోగాలు సాధించినందు విద్యార్థులను పలువురు అభినందించారు.

విద్యుత్ స్తంభానికి ఢీకొని ఒకరి మృతి

ఆర్మూర్‌టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మచ్చర్ల గ్రామంలో మంగళవారం విద్యుత్ స్తంభానికి ఢీకొని చిన్నయ్య(48) అనే వ్యక్తి మృతి చెందాడు. ప్రతీరోజు లాగే మంగళవారం ఉదయం పొలం పనులకు వెళ్తుండగా బైక్ అదుపుతప్పి విద్యుత్ స్తంభానికి ఢీకొట్టడంతో చిన్నయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాన్స్‌కో ఏఈల బదిలీలు

కోటగిరి,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కోటగిరి,పొతంగల్ మండలాల ట్రాన్స్‌కో ఏఈలు బదిలీ అయ్యారు. కోటగిరి ఏఈ కృష్ణ బోధన్‌కు బదిలీ కాగా పొతంగల్ ఏఈ నర్సారెడ్డి నిజామాబాద్ సుభాష్‌నగర్‌కు బదిలీ అయ్యారు. కోటగిరి ఏఈగా బుజ్జిబాబు పిట్లం నుండి బదిలీపై రానున్నారు.

పేద ప్రజల పెన్నిధి సీఎం రేవంత్‌రెడ్డి

రెంజల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడ్‌బిలోలి గ్రామానికి చెందిన మల్ల ప్రశాంత్ అనే యువకుడు గత అనారోగ్యానికి గురవ్వడంతో చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా 40వేల రూపాయల చెక్కును బాధితుడికి కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, క్రాంతి కుమార్, ఖుద్దుస్, బాబు నాయక్, నర్సయ్య, సాయినాథ్, లక్ష్మణ్, సురేష్ పటేల్, యోగేష్, హైమద్ ఖాన్, అంజి, నాగన్న, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

● రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

రుద్రూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. రుద్రూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన వర్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబా, రుద్రూరు సొసైటీ చైర్మన్ బద్దం సంజీవ్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ మాట్లాడుతూ వరి కామన్ రకంకు క్వింటాల్‌కు రూ.2300, వరి ఏ గ్రేడ్ రకంకు రూ.2320 మద్దతు ధర అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులకు తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోకూడదన్నారు. రైతులు ధాన్యం శుభ్రం చేసి పొల్లు లేకుండా, తేమ 17 శాతం లోపు ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలిపారు. రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తుందని తెలిపారు.

● రుద్రూరులో మార్కెట్ కమిటీ చెక్ పోస్టు ప్రారంభం

రుద్రూరు మండల కేంద్రంలో మార్కెట్ కమిటీ చెక్‌పోస్టును మంగళవారం ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం సమకూర్చేందుకు


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఆగ్రోస్ చైర్మన్ కాసుల


చెక్‌పోస్టులను ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఇతర ప్రాంతాలకు తీసుకువెళితే చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేసి ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం వసూలు చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎర్వాల కృష్ణారెడ్డి, తహసీల్దార్ తారాబాయి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, మాజీ జడ్పీటీసీ నారోజీ గంగారం, రుద్రూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, గ్రామ అధ్యక్షుడు పార్వతి ప్రవీణ్, సెక్రటరీ లక్ష్మణ్, షేక్ నిస్సార్, సుబాని, సుదర్శన్‌గౌడ్, సురేందర్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం


అపూర్వ సమ్మేళనంలో పాల్గొన్న 2001-02 పూర్వ విద్యార్థులు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోగల పద్మశాలి కల్యాణ మండపంలో మంగళవారం 2001-2002 పదోతరగత పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు 23ఏళ్ల తరువాత అందరు కలుసుకోవంతో ప్రతీ ఒక్కరు ఆనందడోలికల్లో మునిగి తేలారు. పది పరీక్షలు అనంతరం పైచదువుల నిమిత్తం ఎక్కడెక్కడికో వెళ్లి ఉన్నత చదవుల అనంతరం ఉద్యోగాలు వ్యాపారాల్లో స్థిరపడిన వారందరు దాదాపుగా ఈ అపూర్వ సమ్మేళన కార్యక్రమానికి హాజరై తమ అలనాటి మధుస్మృతులకు గుర్తు చేసుకుంటూ పాతజ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం తమవిద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకుని వారి ఆశీర్వాదాలు అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రుక్మయ్య, దామోదర్ గౌడ్, రాజేశ్వర్, గంగాధర్‌లతో పాటు పూర్వ విద్యార్థులు మైలారం సుధాకర్, గుండ్ల నవీన్, అంకూష్, కొమ్ముల మహిపాల్‌రెడ్డి, గోపిడి రమేష్, బాల్‌రాజ్, సుంకరి నరేష్, జగన్, ప్రవీన్, రమేష్, విద్యార్థినిలు సృజన, ప్రవంతి, మంజులు, సృజన తదితర పూర్వ విద్యార్థి విద్యార్థినిలు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో ఘనంగా సద్దుల బతుకమ్మ సంబరాలు


కమ్మర్‌పల్లి లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కమ్మర్‌పల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : కమ్మర్‌పల్లి మండలం కేంద్రంలో సోమవారం రాత్రి గ్రామ మహిళలు సద్దుల బతుకమ్మ ఆడి బతుకమ్మ సంబరాలను ఘనంగజరుపుకున్నారు ఈ సందర్భంగ గ్రామ ప్రధాన వీదులు సోమవారం అర్ధరాత్రివరకు బతుకమ్మ పాటలతో డీజే మోతలతో మారుమ్రోగాయి. బతుకమ్మ సంబాలల్లో భాగంగా మహిళలతో పాటు చిన్నారులు సైతం ఆడిపాడారు. స్థానిక బస్టాండ్ చౌరాస్తాలో గ్రామానికి చెందిన మహిళ సంఘాల సభ్యులు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు. గ్రామం యావత్తు తరలివచ్చి బతుకమ్మ ఆటాపాలను తిలకించారు. బతుకమ్మల నిమజ్జనంచేసిన చెరువువద్ద స్థానిక గ్రామాభివృద్ధికమిటి, గ్రామపంచాయితీ అధికారులు తగు ఏర్పాట్లును చేయగా స్థానిక పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఏర్గట్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిర్యాల్ గ్రామానికి చెందిన పసుల భరత్‌కు సంబంధించిన మొబైల్ ఫోన్ పోగోట్టుకోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాము సిఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను కనుగొని బాధితుడికి అట్టి మొబైల్‌ను ఫిర్యాదు దారుడి అందజేసినట్లు ఆయన తెలిపారు.

జాన్కంపేట్ మాజీ సర్పంచ్‌కి ఘన నివాళి


మాజీసర్పంచ్ నివాళి అర్పిస్తున్న ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

వేల్పూర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం జాన్కంపేట్ గ్రామంలో గత 15రోజుల క్రితం మరణించిన మాజీసర్పంచ్ కొలిప్యాక గంగారాం కుటుంబసభ్యులను మంగళవారం ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరామర్శించారు. గంగారాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గంగారాం గల మృతికి గల కారణాలను ఆయన కుమారులు శ్రీనివాస్, సంతోష్‌లను అడిగితెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు.మృతుడు గంగారాం సొసైటీ చైర్మన్‌గా, సర్పంచ్‌గా, ఎంపీటీసీగా పదవులు చేపట్టి అన్ని వర్గాల ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

డొంకేశ్వర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వినోద్ పట్టుకున్నారు. తెలిసిన వివరాల ప్రకారం నూత్‌పల్లి నుంచి నందిపేట్ వైపు అక్రమంగా టీవీఎస్ ఎక్సెల్‌పై రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిని డొంకేశ్వర్ కమాన్ వద్ద పట్టుకొని ఒక క్వింటాల్ 69కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. ఆ బియ్యాన్ని శివశక్తి రైస్‌మిల్ గోదాంకు తరలించి వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

పోలీసుల విధులకు అటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

● ఎగ్జిబిషన్ నిర్వాహకులపై కేసు నమోదు

బోధన్‌రూరల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో ఎగ్జిబిషన్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సందర్శకులతో చిన్నపాటి గొడవ జరగగా ఇరు పార్టీలను పోలీసు స్టేషన్‌కు రప్పించామన్నారు. ఈ క్రమంలో ఎగ్జిబిషన్ నిర్వాహకులు అల్తాఫ్, బాకీలు పోలీసుల విదులకు అటంకం కలిగిస్తూ పోలీస్ స్టేషన్‌లోనే ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఎగ్జిబిషన్‌లో సందర్శకులు అబ్దుల్ నాయీమ్ ఫిర్యాదు మేరకు ఇద్దరు నిర్వాహకులపై కేసులు నమోదు చేశామన్నారు. పోలీసుల విధులకు అటంకం కలిగి వీరంగం సృష్టించి దురుసుగా ప్రవర్తించిన అల్తాఫ్ అనే వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు. ప్రజలు పోలీసుల విధులకు అటంకం కలిగించవద్దన్నారు. పోలీసులు ప్రజల కోసమే పని చేస్తున్నారని దేవాలయం లాంటి పోలీస్ స్టేషన్‌లోనే పోలీసులపై వీరంగం, దురుసుగా ప్రవర్తించడం సబబు కాదన్నారు. ఇలాంటి ఘటనలకు పాల్పడిన ఎంతటి వారినైన ఉపేక్షించేది లేదన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కమిటీల వివరాల అందజేత

నవీపేట,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని 32గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీల వివరాలను మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు ఎంపీవో రామకృష్ణకు అందజేశారు. ఇందులో గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. సంబంధిత వివరాలను జిల్లా కలెక్టర్‌కు పంపించడం జరిగిందని ఎంపీవో పేర్కొన్నారు.

అంతర్రాష్ట్ర కాపర్ కాయిల్స్ దొంగల ముఠా పట్టివేత

● మహారాష్ట్రకు చెందిన ముగ్గురు దొంగలు రిమాండ్
● 26కేసులను ఛేదించిన పోలీసులు ● బోధన్ ఏసీపీ


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాస్

బోధన్‌రూరల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ కాపర్ కాయిల్స్ దొంగల ముఠాను ఎట్టకేలకు బోధన్ పోలీసులు పట్టుకున్నారు. ఔరంగాబాద్‌కు చెందిన ముగ్గురు దొంగలు భీంరావ్, రాజు, సంతోష్‌లను మంగళవారం సాయంత్రం రిమాండ్‌కు తరలించామన్నారు. మంగళవారం బోధన్ రూరల్ సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాలూర చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహిస్తుండగా ఎర్టీకా కారులో ముగ్గురు వ్యక్తులు కాపర్ వైర్లు తీసుకెళ్లడం గమనించి వారిని వెంబడించి పట్టుకున్నామన్నారు. వారిని విచారించగా జిల్లాలో పలు చోట్ల 26దొంగతనాలు చేశామని దొంగలు ఒప్పుకున్నారన్నారు. 110కిలోల కాపర్ కాయిల్ వైర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 8కేసులు, నవీపేటలో 7, బోధన్ టౌన్‌లో 5, వర్నిలో 3, నందిపేటలో 1, బాన్సువాడలో 2 ఇలా 26కేసులను ఛేదించామన్నారు. వీరు ముగ్గురు జల్సాలకు అలవాటు పడి కాపర్ కాయిల్స్ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నారన్నారు. రైతుల పంట పొలాల్లో ఎవరు ఉండరాని కాపర్ వైర్లను చోరీ చేయడం సులభతరం అని భావించి చోరీలకు పాల్పడుతున్నారన్నారు. రైతులు, ట్రాన్స్‌కో అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌లకు బోల్టువి కాకుండా వాటి స్థానంలో వెల్డింగ్ చేయాలన్నారు. దొంగలకు బోల్టులను పానాలతో విప్పి చోరీలకు పాల్పడడం సులభతరంగా మారిందన్నారు. అధికారులు, రైతులు వీటిపై దృష్టి సారించాలన్నారు. దొంగలను రిమాండ్‌కు తరలించామని ఆయన వివరించారు. పట్టుకున్న కాపర్ వైర్ విలువ రూ.80వేలకు పైగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ సీఐ విజయ్‌బాబు, ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డిలతో పోలీసు సిబ్బంది తదితరులున్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.

ఆర్మూర్‌లో కళా ఉత్సవ్ పోటీలు


విజేతలకు మెమోంటోలను అందజేస్తున్న ఎంఈవో

ఆర్మూర్‌రూరల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మండల విద్యావనరుల కేంద్రంలో మంగళవారం కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ఇందులో భాగంగా మండలస్థాయి సాంస్కృతిక అంశాలలో పోటీలను నిర్వహించారు. పాటలు, చిత్రలేఖనం, నాటకం, డ్యాన్స్ డ్రామా, వాయిద్యాం, ఆరు అంశాలలో పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాధికారి రాజగంగారాం తెలిపారు. మండలస్థాయిలో విజేతలుగా నిలిచిన వారు జిల్లాస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. పాటల పోటీలలో మనోరిత(కోమన్‌పల్లి) ప్రథమ, అపర్ణ మోడల్‌కాలేజీ ద్వితీయ, సోలో నృత్యం పోటీల్లో సాయిశృతి ప్రథమ, అక్షయ ద్వితీయ, డ్రామా విభాగంలో కృష్ణవేణి మోడల్ స్కూల్ విద్యార్థులు జానపద బృందం విభాగంలో కేజీబీవీ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. విజేతలకు రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు రజనీష్‌కిరాడ్, ఎంఈవో రాజగంగారాం బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కోకిల నాగరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీన సభ పోస్టర్ల ఆవిష్కరణ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు

వేల్పూర్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న హైదరాబాద్‌లోని బాగు లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం వేల్పూర్ మండలం అమీనాపూర్ గ్రామంలో ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు అర్వింద్ ఆధ్వర్యంలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీడీప్యాకర్లు, బట్టి, బీడీ రోలర్స్, వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అర్వింద్ కోరారు. ఐఎఫ్‌టీయూ అనుబంధంగా వివిధ కార్మిక సంఘాలను తీర్మాణం చేయడంతో పాటు 26రంగాల కార్మికుల చట్టబద్ధత యూనియన్‌లను అనుబంధం చేశామన్నారు. ఒక బలమైన కార్మిక ఉద్యమాన్ని పీడీ భవన, ఆటో మోటర్, హమాలి, బిల్, గోద వర్కర్స్, జీపీ తదితర రంగాల్లో కృషి కొనసాగుతుందన్నారు. దేశ వ్యాప్తంగా నిర్మాణానికి ఐఎఫ్‌టీ యూ,టీయూసీఐలో విలీనం చేయాలని ఐఎఫ్‌టీయూ తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధులు తీర్మాణించడం జరిగిందన్నారు. అక్టోబరు 20న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే జనరల్ బాడీలో ఈ విలీన చేయాలని ప్రకటించాలన్నారు. దీనిని కార్మికులు, మిత్రులు అర్థం చేసు కోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఇస్తారు రమేష్, ఇస్తారు జ్యో తి, పద్మ, ప్రభావతి, ఏసుమణి, తలారి మల్లవ్వ, రూప, స్వరూప, లక్ష్మీలు పాల్గొన్నారు.

నవీపేట: ఈ నెల 20న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగే టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సమావేశాన్ని విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షులు డీ.రాజేశ్వర్ కోరారు. ఈ కార్యక్రమంలో దేవన్న, రాము, సాయి, గంగాధర్, రాధ, తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో ఇద్దరి రిమాండ్

రుద్రూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించిన సంఘటన రుద్రూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సాయన్న తెలిపిన వివరాల ప్రకారం దసరా పండుగ (శనివారం) రోజున ఉదయం తెల్లవారు జామున రుద్రూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు రెండు సిలిండర్లు, బియ్యం దొంగతనం చేశారని అంగన్‌వాడీ టీచర్ గంగామణి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా ఎస్‌ఐ సాయన్న దొంగలు ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి సిలిండర్‌లను స్వాధీనం పరుచుకున్నామన్నారు. ఇద్దరు నిందితులను మంగళవారం రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ సాయన్న పేర్కొన్నారు.

మండల మహిళ సమాఖ్య సమావేశం

రెంజల్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల మహిళ సమాఖ్య వార్షిక సమావేశాన్ని మంగళవారం ఐకేపీ కార్యాలయంలో మహిళ మండలి అధ్యక్షురాలు లక్ష్మి, ఏపీఎం చిన్నయ్య ఆధ్వర్యంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మహిళ సంఘాల ద్వారా లోన్‌లు వందశాతం పూర్తి చేయాలని వీవోఏలకు మహిళ సంఘాల ఆధార్ కార్డులు లోపోల్స్‌లో వందశాతం జీపీఆర్‌పీ గురువారం వరకు అప్‌డేట్ చేయాలని ఏపీఎం చిన్నయ్య సూచించారు. మహిళ శక్తి యాక్టివిటీస్, మహిళ సమాఖ్య సమావేశాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీలు వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.



అటవీ అధికారులతో సమావేశమైన గ్రామస్థులు

అటవీ భూమి రక్షణలో.. గౌరారం గ్రామం ఆదర్శం

● అటవీ భూమిలో వేసిన గుడిసెల తొలగింపు ● ప్రకృతిని కాపాడుకోవడంలో ఆదర్శంగా నిలుస్తున్న గ్రామస్థులు



అటవీ భూమిని ఆక్రమించిన వారి పంటలోకి పశువులను పంపిన గ్రామస్థులు

గాంధారి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అటవీ భూమిని సాగు చేసుకోవాలని స్వార్థంతో కొంతమంది ప్రకృతికి విరుద్ధంగా చెట్లను నరుకుతూ పంటలు సాగు చేసుకోవాలని చూస్తుంటే దానికి విరుద్ధంగా గౌరారం గ్రామస్థులు ఏకతాటి పైకి వచ్చి అటవీ భూమిని రక్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. పచ్చటిఅడవితో మమేకమై బతుకుతున్న గౌరారం గ్రామస్థులు ప్రకృతిని నాశనం చేయాలని చూస్తున్న భూ కబ్జాదారుల నుంచి అటవీభూమిని కాపాడటమే లక్ష్యంగా ముందుగా సాగుతున్నారు. అటవీలో పెద్ద టేకు ఇతర చెట్లు రకరకాలుగా ఉండేది. కానీ ప్రస్తుతం అటవీని ఇష్టానుసారంగా నరికి రాత్రివేళలో దున్ని సాగు చేసుకుంటున్న భూ కబ్జాదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు.

అత్యాశకు పోవడమే కారణం

కొందరు స్వార్థపరులు అత్యాశకు పోయి అటవీలోని పెద్దపెద్ద చెట్లను నరుకుతూ రాత్రివేళలో ట్రాక్టర్లతో దున్ని పంటలు సాగుచేయడంతోనే అటవీ విస్తీర్ణం తగ్గిపోయింది. అటవీని నమ్ముకుని బతుకుతున్న వారికి జీవనాధారం లేకుండా పోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. దీనికితోడు పల్లెలలో పశువులకు మేత కూడా కరువు కావడంతో అడవులు తగ్గిపోవడం అటవీలో నివసించే కోతులు సైతం గ్రామాలపైకి వచ్చి ఉండడంతో గౌరారం గ్రామస్థులు దీనికి పరిష్కారం అటవీ ఉంటేనే అటవీ జంతువులు గ్రామాలకు రాకుండా పర్యావరణ సంరక్షణ ఉంటుందని, దీనికి అసలు సమస్య అడవులు తగ్గడమేనని గుర్తించారు. ఎలాగైనా కబ్జాకు గురైన అటవీని ఫారెస్ట్ అధికారులతో కలిసి అటవీని రక్షించాలని ఏకమయ్యారు.

ఆక్రమణల తొలగింపు

అటవీ భూములు రోజురోజుకూ ఆక్రమణకు గురై వృక్షాలు కనుమరుగు అవుతుంటే త ట్టుకోలేకపోయిన ప్రజలు ఒకతాటిపైకి వచ్చి నడుము బిగించారు. గౌరారం గ్రామంలోని ఒకచోట గ్రామస్థులు సమావేశమై అటవీ అధికారులతో మాట్లాడి ఏకగ్రీవ తీర్మానం చేశా రు. గౌరారం గ్రామశివారు ఎంత అటవీభూమి ఉందని సర్వేజరిపించి హద్దులు ఏర్పా టు చేయాలని అధికారులకు సూచించారు. వెంటనే భూమిలో వేసిన గుడిసెలను సైతం తొలగించి అందులో వేసిన పంటలను జంగిడి బర్లతో పంటలోకి తోలారు

అడవులను రక్షిస్తాం..

ఉమ్మడి జిల్లాలోని గాంధారి రేంజ్ పరిధిలో భూమి ఎక్కువగా ఉంటుంది. కానీ కొంతమంది యథేచ్ఛగా చెట్లను నరికి సాగు చేసుకుంటున్నారు. మండలంలోని అన్ని గ్రా మాలలో పెద్ద టేకు చెట్లతోపాటు అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండేది. గత కొన్ని సంవత్సరాల నుంచి కొద్దికొద్దిగా చెట్లను నరుకు తూ సాగు చేసుకుంటూ వస్తుండడంతో అటవీ విస్తీర్ణం తగ్గిపోతూ వస్తోంది. ఈ సంవత్సరం ఉన్న కాస్త అటవీని కూడా కబ్జాకు గురికావడంతో పశువులకు మేత వేయడానికి కూడా ఇబ్బందులు ఏర్పడడంతో అటవీని కాపాడేందుకు ముందుకు వస్తున్నా రు. వారం రోజుల క్రితం గౌరారం గ్రామంలో అక్రమంగా సాగుచేసుకుంటున్న పంట పొలాల్లోకి పశువులను వదిలారు. అటవీని నాశనం చేస్తున్నవారిపై అటవీ అధికారులు దృష్టిసారించాలని కోరుతున్నారు.

అడవులే ఆధారం

● శంకర్, మాజీ సర్పంచ్



పల్లెలోని గ్రామస్థులు అడవులను నమ్ముకుని బతుకుతున్నారు. కొందరు స్వార్థపరులు వారి ప్రయోజనాల కోసం అటవీని నరికేస్తూ అందులో ఉన్న టేకు దుంగలను అమ్మడమేకాకుండా పంటల సాగుకు దిగుతున్నారు. అడవులను రక్షించడం కోసం గౌరారం గ్రామస్థులందరం కలిసి హద్దులు ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.



పూర్తయ్యేనా?

● ఏడేళ్లుగా సాగుతున్నా నేటికీ పూర్తికాని తాండూర్ - ముద్దాపూర్ రోడ్డు నిర్మాణ పనులు

● మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి

● రోడ్డు నిర్మాణానికి మొదటి నుంచి అన్ని అడ్డంకులే..

● కామారెడ్డి - మెదక్ జిల్లాలకు అనుసంధానం చేసే రోడ్డు ఎప్పటికీ పూర్తయ్యేనో?

నాగిరెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి, మెదక్ జిల్లాలకు అనుసంధానం చేస్తే రోడ్డు నిర్మాణం పనులు ఏడేళ్లు అవు తున్నా పూర్తి కావడం లేదు. నాగిరెడ్డిపేట మండలంలోని వెంకంపల్లి గ్రామ శివారులోని మంజీరానదిపై బ్రిడ్జి నిర్మాణం చేయడంతోపాటు మండలంలోని తాండూర్ గేట్ నుంచి వెంకంపల్లి మీదుగా మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని ముద్దపూర్‌కు రెండు వరుసల రోడ్డు నిర్మాణం చేసేందుకు ప్రభుత్వం 2017 సుమారు 33 కోట్ల రూపాయలను మంజూరుచేసింది. వీటిలో మంజీరానదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.12కోట్లు, తాండూరు గేట్ నుంచి మంజీరా నది వద్ద నిర్మించే బ్రిడ్జి వరకు రెండు వరుసల రోడ్డు నిర్మాణం కోసం రూ.20.91 కోట్లు మంజూరుచేసింది. రోడ్డు నిర్మాణం పనులకు గాను 2 డిసెంబర్ 2017న ఎల్లా రెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి శంకుస్థాపనచేశారు. మంజీరానదిపై చేపట్టిన బ్రిడ్జి నిర్మాణం పూర్తయి సుమారు రెండేళ్లు గడుస్తున్నా, రోడ్డు నిర్మాణ పనులు మాత్రం అర్థాంతరంగా నిలిచిపోయి ముందుకు సాగడం లేదు. రోడ్డు నిర్మాణం చేపట్టి సుమారు ఏడేళ్లు అవుతున్నా ఇప్పటికీ రోడ్డు నిర్మాణం పూర్తి కావడం లేదు. మంజీరా బ్రిడ్జి నుంచి వెంకంపల్లి నుంచి మంజీరా బ్రిడ్జి వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయినా, తాండూరు గేట్ నుంచి వెంకంపల్లి వరకు జరిగే రోడ్డు నిర్మాణం పనులు ముందుకు సాగడం లేదు. పలు ఆటంకాల కారణంగా రోడ్డు నిర్మాణం పనులు పూర్తి కావడం లేదు.

● రోడ్డు నిర్మాణానికి అన్నీ ఆటంకాలే..

తాండూరు నుంచి వెంకంపల్లి రోడ్డు నిర్మాణం పనులకు మొదటి నుంచి ఆటంకాలు ఏర్పడుతున్నాయి. 2017లో రోడ్డు నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినా, వివిధ కారణాలతో రోడ్డు నిర్మాణం పనులకు ఇప్పటికీ పూర్తి కావడం లేదు. తాండూరు గేట్ నుంచి మంచిర్యాలజీ వరకు సుమారు 5.5 కిలో మీటర్ల మేర రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు అప్పట్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.20.91 కోట్లను మంజూరు చేసింది. ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను ప్రారంభించారు. తాండూర్ గేట్ సమీపంలోని రోడ్డు నిర్మాణం పనులు చేపట్టే ప్రాంతంలోని సుమారు ఒక కిలోమీటర్ రోడ్డు అటవీశాఖ పరిధిలోకి రావడంతో పనులకు అంతరాయం ఏర్పడింది. అలాగే తాండూర్ గ్రామం వద్ద మరో 600 మీటర్ల రోడ్డు నిర్మాణానికి సంబంధించి స్థలం స్వాధీనం పరచుకుని ప్రక్రియకు సంబంధించిన కోర్టు కేసు కొనసాగు నేపథ్యంలో రోడ్డు నిర్మాణం పనులు ముందుకు సాగక అర్థాంతరంగా నిలిచిపోయాయి. అటవీశాఖ నుంచి అనుమతులు పొందేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. కానీ ఇప్పటివరకు అటవీశాఖ నుంచి ఎలాంటి అనుమతులూ రాలేవని నాగిరెడ్డిపేట ఎఫ్‌ఆర్‌వో వాసుదేవ్ తెలిపారు. అటవీశాఖ నుంచి అనుమతులు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. అలాగే భూసేకరణ విషయమై మొదట్లో కొంత జాప్యం జరిగినా, బాధిత రైతుల్లో చాలామంది రైతులకు అధికారులు నష్టపరిహారాన్ని అందజేశారు. మరికొందరు నష్టపరిహారం అందించే విషయంలో ఇటీవలే తాండూరు గ్రామంలో గ్రామస్థులతో కలిసి ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నే ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి బాధ్యత రైతులకు ఒప్పించేందుకు కృషిచేశారు. ఏదిఏమైనా ఈ రోడ్డు నిర్మాణానికి మొదటి నుంచే ఆటంకాలు ఎదురుకావడంతో రోడ్డు నిర్మాణం పనులు గత ఏడు సంవత్సరాలుగా పూర్తి కాకపోవడంతో మండల వాసులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

● మంజీరా నదిపై పూర్తయిన బ్రిడ్జి నిర్మాణం

కామారెడ్డి మెదక్ జిల్లా వాసులకు అనుసంధానం చేసే వెంకంపల్లి గ్రామ శివారులోని మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పనులు సుమారు రెండేళ్ల క్రితమే పూర్తయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం కోసం తెలంగాణ ప్రభుత్వం 2017లో 12 కోట్ల రూపాయలను మంజూరుచేసింది. సంబంధిత కాంట్రాక్టర్ పనులను వెంటనే చేపట్టి వేగవంతంగా పనులు జరిపి బ్రిడ్జి నిర్మాణం పనులను పూర్తి చేశారు. తాండూర్ నుంచి బ్రిడ్జి వరకు, అలాగే బ్రిడ్జి అవతల వైపు ఉన్న బ్రిడ్జి నుంచి పాపన్నపేట మండలంలోని ముద్దాపూర్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల ప్రజలకు, వాహనదారులకు రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది.

● మెదక్ జిల్లా పరిధిలో ప్రారంభం కాని రోడ్డు నిర్మాణం పనులు

మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయినా బ్రిడ్జి అవతలి వైపు మెదక్ జిల్లా పరిధిలో రోడ్డు నిర్మాణం పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మంజీరా నది నుంచి పాపన్నపేట మండల కేంద్రంకు సుమారు 4 కిలోమీటర్ల మేరకు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కామారెడ్డి జిల్లా పరిధిలోని వెంకంపల్లి గ్రామ శివారు వద్ద మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పను లు పూర్తికాగా, రోడ్డు నిర్మాణం పనులు కొంతవరకు జరిగి కొన్ని ఆటంకా ల కారణంగా పనులు పూర్తికాకపోగా, మెదక్ జిల్లా పరిధిలో మాత్రం ఇప్పటి వరకు రోడ్డు నిర్మాణం పనులు ప్రారం భమే కాలేదు. రోడ్డు నిర్మాణం పనుల ను చేపట్టేందుకు భూసేకరణ చేయాల్సి ఉన్నట్లు తెలిసింది. భూసేక రణ ప్రక్రియ ఇప్పటికీ ఆ జిల్లా అధికారులు మొదలు పెట్టనట్లు తెలు స్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారు లు, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహి త్ తగు చర్యలు తీసుకుని మెదక్ వైపు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



● వెంకంపల్లి శివారులో మంజీరా నదిపై నిర్మాణం పూర్తయిన బ్రిడ్జి

ఎస్సారెస్పీలో బోటు షికారు కలేనా?

● అనాలోచితంగా ఎస్సారెస్పీ బోటు పాయింట్ ● అలల తాకిడికి బోట్లు ధ్వంసం ● నష్టాల పాలైన నిర్వాహకులు

● ప్రాజెక్టులో బోటు షికారు పర్యాటకులకు కలేనా? ● శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో కనిపించని ఆహ్లాదకరం



శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు



ప్రాజెక్టులో బోటు షికారు చేస్తున్న పర్యాటకులు (ఫైల్)

మెండోర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టును తిలకించడానికి పర్యటకులు తమ పిల్ల పాపాలతో వచ్చి సందడి చేస్తుంటారు. ప్రాజెక్టు రిజర్వాయరులో కాస్త ఆహ్లాదకరమైన అనుభూతి పొందడానికి పర్యాటకులు బోటు షికారు చేయాలని కోరుకుంటారు. కానీ తీరా ఇక్కడికి రాగానే బోటు షికారు లేదని తెలువగానే వచ్చిన పర్యటకులు దిగులుతో వెనుదిరుగాల్సి వస్తోంది.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పర్యాటక రంగంగా అభివృద్ధి పరిచాలని ముఖ్య ఉద్దేశంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రిజర్వాయర్‌లో పర్యటకుల కోసం ఏర్పాటు చేసిన బోటుకు అది నుంచి నిర్వాహకులు కష్టాల పాలవుతున్నారు. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు అందాలను తిలకించాడనికి వచ్చే పర్యాటకులకు ప్రాజెక్టు రిజర్వాయర్‌లలో బోటు లేదని తెలువగానే నిరుత్సహంతో వెనుదిరుగుతున్నారు. ప్రాజెక్టులో ఉన్న ఒక్క బోటు షికారుతో ఎంజాయ్ చేద్దామని దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యటకులు అధికారులపై బోటు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● అలల తాకిడికి బోట్లు ధ్వంసం

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం కృత్రిమంగా జరగడంతో బండలతో ఆనకట్ట నిర్మాణం (రిబిట్‌మెంట్) జరిగింది. దీంతో ప్రాజెక్టులో బోటులు నీటి అంచున నిలిపే సమయంలో నీటి అలాల తాకిడికి బోట్లు ధ్వంసమవుతున్న కానీ నష్టాలు జరిగిన కానీ బోటు నిర్వాహకులు ప్రాజెక్టులలో బోటులను నడుపుతూనే ఉండేవారు. ముఖ్యంగా వర్షాకాలం సీజన్‌లో ఎగువ ప్రాంతాల నుంచి వర్షాలు రావడంతో ప్రాజెక్టు రిజర్వాయర్‌లో అలాల తాకిడి ఉధృతంగా వస్తున్న గాలులకు రిజర్వాయరులో ఉంచిన బోట్లు ఆనకట్టకు ఉన్న బండరాళ్లకు తాకి బోట్లు పూర్తిగా చెడిపోయాయి. దీంతో నిర్వాహకులు లక్షల రూపాయలు నష్టాల పాలయ్యారు.

● నష్టాల పాలైన నడవని బోట్లు

బోటు నిర్వాహకులు నష్టాల పాలైన కానీ ప్రాజెక్టులో బోట్లు నడపరాదని పరిమితి షరతులతో ఇబ్బందులు పడుతున్నామని బోటు నిర్వాహకులు అంటున్నారు. లక్షలు వెచ్చించి బోటు నడుపుతున్నా కానీ ఆంధ్ర సర్కారులో ఉన్న షరతులతో బోటు నడపాలని ఆదేశాలు రావడంతో మేము ఏలా బ్రతకాలని బోటు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రూ.32లక్షలపైన నష్టం జరిగిందని, గత్యంతరం లేక వాటిపై ఆధారపడి జీవిస్తున్నామని బోటు నిర్వాహకులు అంటున్నారు. బోటు నడిపే సమయంలో విధించిన అంక్షాల ప్రకారం సెఫ్టీ జాకెట్లు పరిమితకు మించకుండా పర్యాటకులని రిజర్వాయర్‌లో షికారు చేయించామని అన్ని ఆంక్షలు ఉన్న కానీ ఆంధ్ర సర్కారులో ఉన్న పరిమితి షరతులు విధించడం వల్ల అనేక లక్షల రూపాయలు నష్టం జరిగిందని బోటు నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● బోటు షికారు పర్యాటకులకు కలేనా?

విద్యార్థులకు, ఉద్యోగులకు సెలవు దినాలు వచ్చినవంటే చాలు కుటుంబసభ్యులతో తమ పిల్లపాపలతో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తుంటారు. అటువంటి పార్యటక ప్రాంతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఒకటి ఈ ప్రాజెక్టుకు వచ్చి ప్రాజెక్టు అందాలను తిలకించి రిజర్వాయర్‌లో ఏర్పాటు చేసిన బోటింగ్ పాయింట్‌లో బోటు షికారు చేసిసందడి చేయాలని పర్యాటకులు తరలివస్తుంటారు. అటువంటి ప్రాజెక్టులో బోటు షికారులేదని తెలియగానే పర్యాటకులు నిరాశతో వెనుదిరిగక తప్పడంలేదు. రాబోయే రోజుల్లోనైనా బోటు షికారు ఉంటుందో లేక కలగానే మిగిలిపోతుందో వేచి చూడాలి.

● శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో కనిపించని ఆహ్లాదకరం

శ్రీరాంసాగర్‌ప్రాజెక్టులో బోటు షికారు లేకపోవడంతో ఆహ్లాదకరమైన వాతావరణం కనిపించకుండా పోతుంది. రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి శఋశ్రీరాంసాగర్‌ప్రాజెక్టు వస్తు ప్రాజెక్టు అందాలను తిలకిస్తుంటారు. కాస్త ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రాజెక్టు రిజర్వాయర్‌లో బోటు షికారు చేద్దామని పర్యాటకులు వస్తుంటారు. కానీ తీరా ఇక్కడికి వచ్చే సరికి ప్రాజెక్టులో బోటు షికారు లేదని తెలువగానే పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నారు. శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు రాగానే ఏటువంటి అభివృద్ధి ఇక్కడ లేదని ఉన్న బోటు షికారును ఎందుకు బంద్ చేశారని పర్యాటకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వివిధ జిల్లాల పర్యాటకులు ప్రాజెక్టులో ఉన్న బోటు షికారులో షికారు చేస్తూ తమ పిల్లపాపలతో బోటులో ప్రయణం చేస్తు తమ ఫోన్‌లో ఫొటోలను బందించుకొని సందడి చెద్దామని ఇక్కడికి వస్తే ఇక్కడ ఎటువంటి ఆహ్లాదకరమైన సందడి లేదని పర్యాటకులు బోటు నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పర్యాటకులను దృష్టిలో పెట్టుకొని ప్రాజెక్టులో నిరుపయోగంగా ఉన్న బోటుషికారును వినియోగంలోకి తీసుకురావాలని పర్యాటకులు కోరుతున్నారు.

ప్రాజెక్టులో బోటు నడిచేలా చూడాలి

● ఏలేటి శ్రీనివాస్, పర్యాటకుడు



రాష్ట్రంలోనే పేరొందిన పర్యాటక ప్రాంతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అందాలను తిలకించడానికి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారు. ప్రాజెక్టుకు రాగానే ఇక్కడ కనీసం సౌకర్యాలు కూడా లేవు. ప్రాజెక్టులో బోటింగ్ పాయింట్ ఉందని తెలియగానే బోటు షికారు స్నేహితులతో కలిసి చెద్దామని వచ్చే వారికి తీరా ఇక్కడికి రాగానే బోటు బంధు అయ్యిందని తెలియగానే నిరాశతో వెనుదిరగాల్సి వచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యాటకులను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టులో బోటింగ్ నడిచేలా చూడాలని కోరుతున్నాం.

పాడిపశువులకు అందని వైద్యం

● గ్రామాల్లో పశువైద్య సౌకర్యం లేక రైతుల అవస్థలు

● ప్రైవేట్ వైద్యులను సంప్రదించినా అందని వైద్యం



రాజంపేటలో శిథిలావస్థలో ఉన్న పశువైద్యశాల

రాజంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు వ్యవసాయంతో పాటు పాడి పశువుల పెంపకం చేపడుతున్నారు. కాని పాడి పశువులకు ఏమైన రోగాలు వస్తే చికిత్స అందించేందుకు వైద్యులు లేక వైద్యకేంద్రాలు మూత పడుతున్నాయి. కొన్ని గ్రామాలలో కేంద్రాలు లేక ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సి వస్తుందని ప్రైవేట్ వైద్యులు కూడా సమయానికి రాకపోవడంతో పశువులకు వైద్య పరీక్షలు చేయించడానికి ఎన్నో అవస్థలు పడుతున్నామన్నారు. ఈ మద్యకాలంలో వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా చేసుకుని జీవనం సాగిస్తున్న రైతులు ఎంతోమంది ఉన్నారు. కాని మండల కేంద్రంలోని సబ్ సెంటర్ ఉండడంతో శిధిలవస్థలో చిన్నపాటి గదిని పశువైద్యకేంద్రంగా ఏర్పాటుచేసి సిబ్బంది మాత్రం లేకపోవడంతో ఉన్నవారు కూడా సరైన సమయానికి రాకపోవడంతో ప్రైవేట్ వైద్యులను సంప్రదించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. భిక్కనూర్ మండలంలోని జంగంపల్లి వైద్యశాల వైద్యులు రాజంపేటమండలంలో ఇంచార్జ్‌గా ఉండడంతో సమయానికి సేవలు అందడం లేదని వాపోతున్నారు. పేరుకు మాత్రమే మండలంగా ఏర్పడిందని సిబ్బంది కొరత అలాగే ఉందని పేర్కొంటున్నారు. మండలంలోని తలమడ్ల,గుండారం గ్రామాలలో గోపాల మిత్ర సిబ్బంది ఉన్న వైద్యం అందడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 12 గ్రామ పంచాయతీలలో పశువైద్యసౌకర్యం లేకపోవడంతో పాడిరైతులు అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుండారంలో పశువైద్యకేంద్రం ఉన్న అందులో సిబ్బంది లేకమూతపడిందని గ్రామస్థులు తెలిపారు. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటుసరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. గడిచిన 10 ఏళ్ల కాలంలో సరైన వైద్యం నోచుకోకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. రైతులకు పాడి, పంట చేదోడు వాదోడుగా ఉంటుండగా రోగం వస్తే పశువులను ఎక్కడ చూపించాలని ఆవేదన చెందుతున్నారు. సీజనల్ వ్యాధులతో పశువులు మృతి చెందుతున్న పట్టించుకునే పరిస్థితి లేదు. కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోటిఆశలు పెట్టుకున్న రైతులు ఈ సారైన పశుసంవర్ధకశాఖ కదలకపోతుందా అని ఎదురుచూస్తున్నారు.

వైద్యం అందక అవస్థలు

పాలఉత్పత్తి పెంచడంలో రైతుల ముందున్న కాలంలో గ్రామాలలో పశువైద్యులు లేక అవస్థలు పడుతున్నాం. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వస్తాయని గతకొన్ని సంవత్సరాల నుంచి గ్రామాలలో పశువైద్యులు లేక ఇబ్బందులు పడుతున్నాం. పశువులకు వైద్యపరీక్షలు చేయాలంటే ప్రైవేట్‌వైద్యులను సంప్రదించాల్సి వస్తుంది. వారు సైతం సమయానికి రాకపోవడంతో పశువులు మృత్యువాత పడుతున్నాయి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలలో పశువైద్యశాల ఏర్పాటు చేసి వైద్యులను నియమించాలని అధికారులను కోరుతున్నాం

సబ్‌సెంటర్ అందుబాటులో ఉంది

● అనిల్‌రెడ్డి, ఇన్‌చార్జి పశువైద్యుడు, రాజంపేట

మండలకేంద్రంలో సబ్ సెంటర్ అందుబాటులో ఉంది. అందులో సిబ్బంది అసిస్టెంట్, అటెండర్ ఇద్దరూ ఉన్నారు. వీరితోపాటు ఇన్‌చార్జి వైద్యులు మొత్తం మండలంలో సేవలు అందిస్తున్నాం. సిబ్బంది కొరత ఉండడంతో ఒకే సమయంలో అన్ని గ్రామాలు చూడలేమని రైతులు సమస్య కోసం ఫోన్ ద్వారా సంప్రదిస్తే అందుబాటులో ఉంటున్నామని, తలమడ్ల, గుండారం గ్రామాల్లో గోపాలమిత్ర సిబ్బంది ఉంది.


తిమ్మాపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాల్‌రాజు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్

బీర్కూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం ఆయన బీర్కూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. అన్నదాతలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించుకుని, ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరను పొందాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మైలారం విండో చైర్మన్ హన్మంత్‌రావు, నాయకులు అప్పారావు, శంకర్, రఘు, కృష్ణారెడ్డి, శ్రీధర్, విండో కార్యదర్శి నరేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి


భిక్కనూరులో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏడీఏ అపర్ణ

భిక్కనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏడీఏ అపర్ణ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలకేంద్రంలోని గంజిలో భిక్కనూరు విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించాలని సూచించారు. వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కావాల్సిన అన్ని వసతులను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు, విండో చైర్మన్ భూమయ్య ఏఎంసీ వైస్ చైర్మన్ పాపనోళ్ల స్వామి, తహసీల్దార్ శివప్రసాద్, విండో ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

బీర్కూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం బీర్కూర్ మండల కేంద్రంలో రైతులు ధాన్యం కుప్పల వద్ద తమ నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోతలు ప్రారంభమై రోజులు గడుస్తున్నా అధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదన్నారు. వారం రోజుల క్రితం పంటలు కోసి ధాన్యం ఆరబెట్టుకుంటునానమని, ప్రస్తుతం ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం వల్ల ధాన్యం ఎక్కడ విక్రయించు కోవాలో అర్థం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు వర్షం కురుస్తుండటం వల్ల ధాన్యం తడుస్తుందన్నారు. అధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్‌చేశారు.

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్ పర్సన్ మారెడ్డి రజితరెడ్డి

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ సాధారణ సమావేశం మంగళవారం కార్యాలయంలో చైర్ పర్సన్ మారెడ్డి రజితారెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించి ఏకగ్రీవంగా తీర్మానంచేశారు. మార్కెట్ యార్డు ఎల్లారెడ్డిలో అదనంగా 10 నూతన దుకాణ సముదాయాలను నిర్మించుట, మార్కెట్ యార్డు ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, లింగంపల్లి వద్ద 100 ఎంటీఎస్ వే బ్రిడ్జిల నిర్మాణం పనులపై కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ జొన్నల రాజు, సభ్యులు శంకరయ్య, పుల్‌సింగ్, నాగేశ్వర్, నగేష్, అజయ్, లక్ష్మీనారాయణ, గంగారెడ్డి, లక్ష్మణ్, శ్రీనివాస్, గంగారెడ్డి, కార్యదర్శి శ్రీకాంత్, సిబ్బంది, శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ సంస్థ, ఏఎంసీ చైర్మన్‌కు సన్మానం

భిక్కనూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలకేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పాత రాజు, వైస్ చైర్మన్ పాపనోళ్ల స్వామిని వ్యవసాయాధికారులు మంగళవారం శాలువతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా గ్రంథాల సంస్థ చైర్మన్, ఏఎంసీ చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయాధికారులకు ఎల్లప్పుడు తమ పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని, రైతుల సంక్షేమానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో రాధ, నాయకులు ఇంద్రకరణ్‌రెడ్డి, భీంరెడ్డి, సుదర్శన్, దయాకర్‌రెడ్డి, ఏఈవోలు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

బీర్కూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ జిల్లా సహకార సంఘం బ్యాంకు ద్వారా వివిధ రకాల రుణాలను అందిస్తున్నామని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీర్కూర్ ఎన్డీసీసీబీ బ్యాంకు మేనేజర్ రవీందర్ పేర్కొన్నారు. మంగళవారం బ్యాంకు ఖాతాదారులకు రుణాలకు సంబంధించిన కరపత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్షక మిత్ర పేరిట రైతు వ్యవసాయ భూమిని మాడిగేజ్ చేసుకుని రెండు లక్షల నుంచి 10 లక్షల వరకు రుణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. అలాగే విద్యార్థులకు విద్య రుణం, బంగారు ఆభరణాలపై, గృహ నిర్మాణం కోసం తదితర అవసరాల కోసం రుణాలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జాతీయస్థాయి సమావేశానికి భిక్కనూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ ఎంపిక



భిక్కనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ ఈ నెల 17నుంచి 19వరకు ఢిల్లీలో నిరంతర వృత్తిపర అభివృద్ధి అంశంపై జరిగే జాతీయ సమావేశానికి ఎంపికయ్యారు. ఈ మేరకు విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో రాజ్‌గంగారెడ్డి మాట్లాడుతూ ఈ సమావేశంలో ఒక్కో రాష్ట్రానికి ఒక్కో ప్రతినిధి మాత్రమే ఎంపిక చేస్తారని, తెలంగాణ రాష్ట్రం నుంచి మండలానికి చెందిన బాలు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనాథ్ ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సమావేశంలో శ్రీనాథ్ మన రాష్ట్రం తరుపున నిరంతర వృత్తిపర అభివృద్ధి అంశంలో బాగంగా పలు సూచనలు చేయనున్నట్లు వివరించారు. కాగా జాతీయస్థాయి సమావేశానికి ఎంపికైన శ్రీనాథ్‌కు అభినందనలు వెలువెత్తుతున్నాయి.

అకాల వర్షంతో రైతన్న దిగాలు


బాన్సువాడ పట్టణ శివారులో వర్షానికి నేలరాలిన వరి పంట


బాన్సువాడ మార్కెట్ యార్డులో తడిసిన వరి ధాన్యం

● కోతకొచ్చిన వరి పంట నేల పాలు
● ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

బాన్సువాడ టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన పంట అకాల వర్షం కారణంగా దెబ్బ తింటోందని రైతన్న దిగాలు చెందుతున్నారు. ఈ సీజన్‌లో రైతులు ఎక్కువగా వరి పంటలు వేశారు. అనుకున్నట్టుగానే కాలం కలిసి రావడంతో వరిపంట దిగుబడిపై రైతన్నలు గంపెడాశలు పెట్టుకున్నారు. కానీ అకాల వర్షాలు ఎలాంటి ఉపద్రవాన్ని తెచ్చిపెడుతుందోనన్న ఆందోళన రైతుల్లో కలుగుతోంది. బాన్సువాడ పట్టణ శివారులో మంగళవారం ఓ మోస్తారు వర్షం కురిసింది. దీంతో పట్టణ శివారులోని రైతుల పంట పొలాల్లో వరిపైరు కాస్త నేల రాలింది. పట్టణంలోని మార్కెట్ యార్డులో ఓ రైతు వరి ధాన్యాన్ని ఆరబెట్టాడు. అకాల వర్షం కురియడంతో ధాన్యం తడిసి ముద్దయిందని రైతన్న అవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

మాల్తుమ్మెదలో ఘనంగా దర్గా ఉత్సవాలు


దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మత గురువులు

నాగిరెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాల్తుమ్మెద గేట్ వద్ద గల సూఫీ షా మహ్మద్ అబ్దుల్ వాహెద్ షత్తారి ఉల్ ఖాద్రి ఉర్సు ఉత్సవాలు సోమవారం రాత్రి భక్తి శ్రద్ధలతో ఘనంగా జరిగాయి. దర్గా పీఠాధిపతి సూఫీషా మొహ్మద్ అబ్దుల్ రహీం షత్తారి ఉల్ ఖాద్రి ఆధ్వర్యంలో దర్గా ఉత్సవాలు అత్యంత వైభవంగా కన్నుల పండువగా జరిగాయి. ఈ దర్గా ఉత్సవాలలో సంగారెడ్డి జిల్లా అన్నాసాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సూఫీ షా మొహ మ్మద్ ఖలీల్ హుస్సేన్ షత్తారి ఉల్ ఖాద్రి ప్రత్యేక ఆహ్వానితులుగా హజరై దర్గా ఉత్సవాలను ప్రారంభించారు. దర్గా ఉత్సవాలలో భాగంగా సోమవారం ఖురాన్ పఠనంతో కార్యక్రమాలు ప్రారంభించారు. అనంతరం మాల్తుమ్మెద గ్రామానికి చెందిన విఠల్‌రెడ్డి, నర్సింహారెడ్డి ఇంటి నుంచి గంధం, చాదర్‌లను దర్గా వరకు బ్యాండ్ మేళాలతో ఊరేగింపుగా తీసుకువచ్చి గంధం, చాదర్ లను దర్గాపై సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం రాత్రి ఖవ్వాలీ కార్యక్రమం నిర్వహించారు. కుల మాతాలకతీతంగా కామారెడ్డి, మెదక్ జిల్లాలకు చెందిన వివిధ మండలాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నా సాగర్ దర్గా పీఠాధిపతి హజ్రత్ సూఫీషా మొహమ్మద్ ఖలీల్ హుస్సేన్ షత్తారి ఉల్ ఖాద్రి, మాల్తుమ్మెద దర్గా పీఠాధిపతి మొహమ్మద్ రహీం షత్తారి ఉల్ ఖాద్రి, గోపాల్‌పేట్ దర్గా పీఠాధిపతి సూఫీషా పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో లక్ష్మీ

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని ఎల్లారెడ్డి ఎంపీడీవో లక్ష్మీ అన్నారు. మండలంలోని మల్లాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: బీబీపేట మండలంలోని జిల్లాపరిషత్ పాఠశాలలో వరల్డ్ హ్యాండ్ వాష్ డే సందర్భంగా హ్యాండ్‌వాష్ ప్రోగ్రాంను మండలప్రత్యేకాధికారి సతీష్‌యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చేతుల పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అనంతరం షేర్ బీబీపేట మురికికాలువలను పరిశీలించి శుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

కాచాపూర్‌లో పశు వైద్య శిబిరం


కాచాపూర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్న పశు వైద్యాధికారులు

భిక్కనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని కాచాపూర్ గ్రామంలో మంగళవారం పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి దేవేందర్ గ్రామంలోని ఆవులు, గేదేలు, దూడలకు గాలికుంటు వ్యాధి నిరోదక టీకాలను వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి నవంబరు 14 వరకు ప్రతిగ్రామంలో పశు వైద్య శిబి రాన్ని ఏర్పాటు చేసి మండలంలోని అన్ని ఆవులు, గేదేలు, దూడలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేయడం జరుగుతుందన్నారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోట్లో పుండ్లు ఏర్పడటం, కుంటడం, మేత సరిగ్గా మేయక పోవడం, పాలు తక్కువగా ఇవ్వడం జరుగుతుందన్నారకీ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది భరత్, మహేష్, సురేష్, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి: రామారెడ్డి గ్రామంలో పాడిపశువులకు ఉచిత గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాస్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పశువులలో వచ్చే అతి ప్రమాదకరమైన వ్యాధులలో ఒకటని దానికి నివారణే మార్గమని సూచించారు. ఈ కార్యక్రమం వచ్చే నెల 14 వరకు జిల్లాలోని ప్రతీ గ్రామంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 228 పశువులకు ఉచిత టీకాలు మండలంలో వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి రామచందర్, సహాయ సంచాలకులు డాక్టర్ సంజయ్‌కుమార్, వీఎల్‌ఓ శ్రీనివాస్‌రావు, జీవీవో నారాయణ, పశు వైద్య సహాయకుడు రమేష్, అంజనేయులు, బాలమణి, రవీందర్ పాల్గొన్నారు.

తాడ్వాయి: మండల కేంద్రంలోని పశువైద్యశాఖ ఆవరణలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. గ్రామంలో ఆవులు, గేదెలకు గాలికుంటూ టీకాలు వేయడం జరిగిందని అన్నారు. గాలికుంటు రోగం వస్తే పాల దిగుబడి తగ్గుతుందని, కట్టిన పశువులకు ఇడుచుకుపోయే ప్రమాదం ఉంది కాబట్టి ప్రతి పాడి రైతు టీకాలు వేసుకోవాలని సూచించారు. మొత్తం 47 ఆవులకు, 198 గేదెలకు టీకాలు వేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రమేష్, పోచయ్య, కొండల్‌రెడ్డి, ప్రేమ్‌సింగ్, గంగారాం, బాలచందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో ఆడిట్


నాగిరెడ్డిపేట గ్రామ పంచాయతీలో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారి

నాగిరెడ్డిపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను నాగిరెడ్డిపేట మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఆడిట్ అధికారి అనిల్‌కుమార్ ఆడిట్ నిర్వహిస్తున్నారు. మంగళ వారం నాగిరెడ్డిపేట గ్రామ పంచాయితీ కార్యాలయానికి సంబంధించి 2023-24 ఆర్థిక సంవత్సరంలో గ్రామ పంచాయితీకి మంజూరైన వివిధ ప్రభుత్వ నిధులు, గ్రామ పంచాయితీ ఆదాయం, వాటి ఖర్చుల లావాదేవీలపై ఆడిట్ అధికారి ఆడిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కార్తీక్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు కోసం ఉద్యమించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

భిక్కనూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ అన్నారు. మంగళవారం భిక్కనూరు మండలం లోని జంగంపల్లిలో సీపీఎం మండల ప్రథమ మహాసభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జెండా ఆవిష్కరించి అమరుల స్థూపానికి నివాళులు అర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక హామీలను ఇచ్చిన నేరవేర్చడం లేదని, ముఖ్యంగా ఆరుగ్యారెంటీల అమలులో నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. ఇచ్చిన మాటప్రకారం రైతుబంధు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, ఇళ్ల స్థలాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు చంద్రశేఖర్, కొత్త నర్సింలు, నర్సవ్వ, రామస్వామి, సిద్దరాములు, చంద్ర కళ, ప్రవీణ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.


జంగంపల్లిలో సీపీఎం మహాసభను నిర్వహిస్తున్న దృశ్యం


మద్నూర్ సోయాబీన్ కొనుగోలు కేంద్రంలో వ్యవసాయ అధికారి, సిబ్బంది

గ్రామాల వారీగా సోయాబీన్ కొనుగోళ్లు

మద్నూర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో సోయాబీన్ విక్రయించే రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు కాంటా చేస్తామని గ్రామాల వారీగా రైతులు తమ సోయా పంటను మద్నూర్ మార్కెట్ యార్డుకు తీసుకురావాలని వ్యవసాయ అధికారి రాజు సూచించారు. మంగళవారం మద్నూర్ మార్కెట్ కమిటీలో ఏర్పాటు చేసిన సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ సీఈవో బాబురావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు రైతులు తమ సోయాబీన్ కొనుగోలు చేయడం లేదని ఫిర్యాదు చేయడంతో స్పందించిన వ్యవసాయ అధికారి రాజు ఆయా గ్రామాల వ్యవసాయ విస్తీర్ణ అధికారుల వద్ద టోకెన్ రాయించుకుని రావాలని గ్రామాల వారీగా తేదీలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతులకు ఇచ్చిన తేదీ రోజున మార్కెట్ యార్డుకు సోయాబీన్ తీసుకురావాలని సూచించారు. ఆవిధంగా రైతులు కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చినట్లయితే కొనుగోలు కేంద్రంలో రద్దీ ఏర్పడకుండా రైతులు నిరీక్షణ చేయకుండా పంట కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రైతుల వద్ద ఉన్నటువంటి సోయాబీన్ కొనుగోలు చేసే వరకు మద్నూర్ మార్కెట్ యార్డులో కొనుగోలు కేంద్రం ఉంటుందని తెలిపారు. ఆయనతో పాటు వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అనిల్, సౌమ్య, భాజన్న పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలి: ఆర్డీవో


డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో పనులను పరిశీలిస్తున్న ఆర్డీవో

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ పరిధిలోని సోమార్పేట్ బైపాస్ వద్ద నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో జరుగుతున్న మౌలిక వసతుల సదుపాయాల పనులను మంగళవారం ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మురికి కాలువ నిర్మాణ పనులను విద్యుత్ రోడ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరి రాజు, ఎంపీవో ప్రకాష్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

ఎల్లారెడ్డి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఎల్లారెడ్డిలో చోటు చేసుకుంది. ఎల్లారెడ్డి ఎస్సై బొజ్జ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మల్లాయిపల్లి గ్రామానికి చెందిన భూమయ్య (46) అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఎలాంటి చికిత్స తీసుకున్న ఆరోగ్యం మెరుగు పడకపోవడంతో డబ్బులు వృధా ఖర్చు అవుతున్నాయని బాధపడుతూ ఉండేవాడని, మంగళవారం ఉదయం బయటకు వెళుతున్నాని ఇంట్లో కుటుంబ సభ్యులకు చెప్పి తిరిగి రాకపోవడంతో గ్రామ పరిసర ప్రాంతాల్లో వెతుకగా చెట్టుకు చీరతో ఉరి వేసుకుని మృతి చెందాడని, మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

లింగంపల్లిలో కత్తిపోట్ల కలకలం


కత్తిపోట్లకు గురైన వ్యక్తి

సదాశివనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి గ్రామంలో కొందరు వ్యక్తులపై జరిగిన కత్తిపోట్ల సంఘటన మండల వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డబ్బుల వివాదం నేపథ్యంలో గుండెల్లి మోహన్, గుండెల్లి సాయిలు, అనిల్‌కుమార్ అనే వ్యక్తులను అదే గ్రామానికి చెందిన గుండెల్లి సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్, ఆకాష్ కత్తితో, చేతులతో కొట్టగా మోహన్, సాయిలు తలకు తీవ్ర గాయాలయినట్లు తెలిపారు. గాయపడిన వారిని కుటుంబసభ్యులు చికిత్స కోసం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. సాయిలు కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కత్తిపోట్ల విషయంపై నిజనిజాలు సేకరించి దోషులను కఠినంగా శిక్షించడం జరుగుతుందని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా లింగంపల్లి గ్రామంపై ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి దోషులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

33వ వార్డులో పారిశుధ్య పనుల నిర్వహణ

కామారెడ్డిటౌన్,అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి పట్టణంలోని 33 వ వార్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. కాలనీవాసులు డ్రైనేజీ సమస్య, నీటి సమస్య ఉంద ని తెలుపడంతో వెంటనే స్పందించి పను లు చేయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎస్సై పర్వేజ్, జవాన్ రాజేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

సదాశివనగర్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డిలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏపీజే అబ్దుల్ కలాం జయంతి మంగళవారం నిర్వహించారు. తుదిశ్వాస వరకు భారతదేశానికి ఆయన చేసిన సేవలు గొప్పవని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చట్ట పరిరక్షణ కమిటీ డైరెక్టర్ సలీం, సాధిక్‌అలీ, శ్రీనివాస్ గుప్తా, నితిన్‌కుమార్, గంగయ్య, లింగం, రాజయ్య శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల ఆధ్వర్యంలో బాన్సువాడ బంద్

బాన్సువాడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రామ్‌గిరి మహరాజ్, నరసింహ, ఆనంద్, మహ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం బాన్సువాడ పట్టణంలో ముస్లింలు దుకాణ సముదాయాలు బంద్ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జామ మసీద్ నుంచి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఏవోకు వినతిపత్రం అందజేశారు. మత పెద్దలు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసు కోవాలని, ఇక ముందు ఎవరూ కూడా ఎటువంటి వ్యాఖ్యలు చేయకుండా కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకురావాలని వారు డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో జామ మసీద్ అధ్యక్షుడు ఇంతియాజ్ అహ్మద్, మజీద్ ఎ నూర్ అధ్యక్షుడు నయీం, ముస్లీం సోదరుడు పాల్గొన్నారు.



బాన్సువాడలో ర్యాలీ నిర్వహిస్తున్న మైనారిటీలు

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	140	180	200
వెన్‌కాబ్(కిలో)	:	130	160	190

